వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 356 గురువారం | 22 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# డోర్నకల్ సీడీపీఓగా లక్ష్మి నియామకం

వరంగల్ వాయిస్ ఎఫెక్ట్

2 లో..



# కొండా vs బస్వరాజ్

- ఇద్దరి మధ్య పెరుగుతున్న గ్యాప్
- సారయ్యపై బహిరంగంగా విమర్శలు చేసిన మురళి
- పేద బీసీ ప్రజలకు అన్యాయం చేస్తావా అంటూ ప్రశ్న
- దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలువాలంటూ సవాల్
- పట్టణ కాంగ్రెస్‌లో ముసలం

వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ వర్గపోరు తీవ్రమవుతోంది. ఒకరిపై ఒకరు ప్రత్యక్ష దూషణలకు దిగుతున్నారు. రెండు కత్తులు ఒకే ఒరలో ఇమడవన్నట్లుగా ఇక్కడి పరిస్థితి మారింది. ఇద్దరు సీనియర్ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే మండేలా తయారైంది. ఇక్కడినుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన కొండా సురేఖ రాష్ట్ర మంత్రి వర్గంలో కీలక భూమికను పోషిస్తుండగా మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు మంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఉన్న సీనియర్ నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మధ్య వర్గ పోరు రచ్చకెక్కుతోంది. నగరపాలక సంస్థ సిబ్బంది రెండు రోజుల క్రితం మండిబజార్ ప్రాంతంలో చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించడం అగ్గికి ఆజ్యం పోసినట్లుగా మారింది. ఈ ప్రాంతాన్ని గురువారం సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు స్థానికంగా ఉంటున్న ఎమ్మెల్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ నాయకుడివి అయివుండి పేద బీసీ ప్రజలకు అన్యాయం చేస్తావా అంటూ మండిపడ్డారు. సారయ్య పేరును ప్రస్తావిస్తూ తను ఎమ్మెల్సీగా ఇనానిమస్‌గా గెలిచినప్పటికీ పార్టీ మారడంతో రాజీనామా చేశా.. నువ్వు బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి ఇప్పుడు పార్టీ మారావు.. దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలువాలంటూ సవాల్ విసిరారు. వీరిరువురూ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కావడంతో పాటు గతంలో బీఆర్ఎస్ లో చేరి తిరిగి సొంత గూటికి వచ్చినవారే కావడం గమనార్హం. ఇద్దరు సీనియర్ల వర్గపోరుతో వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



2 లో..

## జర్నలిస్ట్ తిరుపతిరెడ్డి హఠాన్మరణం

ప్రెస్ క్లబ్‌లో నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు



8లో..

## రైతులతో రాజకీయాలు వద్దు

- అందరికీ రుణమాఫీ చేసి తీరాల్సిందే
- అప్పటివరకు బీఆర్ఎస్ పోరాడుతోంది
- మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, నన్నపునేని, చల్లా

వరంగల్ వాయిస్ Evening Daily
గురువారం 22, ఆగస్టు 2024
www.warangalvoice.net

# కొండా V/s బస్వరాజ్



## ఇద్దరి మధ్య పెరుగుతున్న గ్యాప్

## సారయ్యపై బహిరంగంగా విమర్శలు చేసిన మురళి

## పేద బీసీ ప్రజలకు అన్యాయం చేస్తావా అంటూ ప్రశ్న

## దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలువాలంటూ సవాల్

## పట్టణ కాంగ్రెస్‌లో ముసలం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లు కాంగ్రెస్ లో సమన్వయం కరువైంది. మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్సీల మధ్య సఖ్యత కొరవడింది. వీరి మధ్య ఆధిపత్య పోరు మళ్లీ మొదలైంది. వీరు ఒకే పార్టీలో ఉన్నా..వేరు వేరు పార్టీల్లో ఉన్నా వీరి మధ్య పొసగడంలేదు. అభివృద్ధిని విస్మరించి పంతాలకు పోవడంతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. మురళి మీసం మెలేస్తుండగా..సారయ్య చాపకింద నీరులా రాజకీయాలు చేయడంతో ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే మండే పరిస్థితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రత్యర్థులుగా ఉంటూ ఒకరిపై ఒకరు కత్తులు నూరుకున్న వీరు నేడు ఒకే పార్టీలో చేరడంతో వారి మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. బీసీ నేతగా బస్వరాజు సారయ్యకు మంచి పేరుంటే పేదల పెన్నిధిగా కొండా మురళీధర్ రావుకు ప్రజల్లో గుర్తింపు ఉంది.

### ఘాటు వాఖ్యలు..

నగరపాలక సంస్థ సిబ్బంది మండిబజార్ లోని చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించడానికి స్థానికంగా ఉంటున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యే కారణమంటూ అభిప్రాయం వ్యక్తం చేసిన కొండా మురళి ఆయనపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక బీసీ నాయకుడివి అయివుండి.. పేద బీసీ ప్రజలకు అన్యాయం చేస్తావా అంటూ మండిపడ్డారు. బస్వరాజు సారయ్య పేరును బహిరంగంగానే ప్రస్తావిస్తూ ఇలాంటి పనులు మానుకోవాలంటూ హితవు పలికారు. లేనిపక్షంలో అధిష్టానానికి ఫిర్యాదు చేస్తారంటూ హెచ్చరించారు. నేను ఇనానిమస్ గా ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ పార్టీ మారడంతో రాజీనామా చేశానంటూ గుర్తు చేశారు. నువ్వు ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారావు.. నిజంగా దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలువాలంటూ సవాల్ విసిరారు.




### తూర్పుపై పట్టు..


ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన కొండా సురేఖకు రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం కల్పించారు. 2009లో పరకాల శాసనసభ నియోజకవర్గం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండా సురేఖకు వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా కూడా పని చేశారు. 2013లో వైసీపీతో విబేధించిన ఆమె 2014 ఎన్నికలకు ముందుకు బీఆర్ఎస్ లో చేరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖ చేతిలో 55వేల ఓట్ల తేడాతో బస్వరాజు సారయ్య ఓడిపోయారు. 2018లో బీఆర్ఎస్ కు రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే 2016లో తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరిన బస్వరాజు సారయ్య ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గవర్నర్ కోటాలో 2020లో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. 2024లో నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటినుంచే వీరిరువు మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. వరంగల్ తూర్పు నియోజకవర్గంపై కొండా సురేఖకు మంచి పట్టు ఉంది. బస్వరాజు సారయ్య సైతం మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ పాలనలో మంత్రి పదవిని కూడా అనుభవించారు. అయితే ఇద్దరు నేతలకు వరంగల్ తూర్పు నియోజకవర్గంపై పూర్తి పట్టు ఉంది. సారయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అదే పార్టీకి చెందిన కొందరు నేతలు, కార్యకర్తలు ఆయనను కలువడంతో ఇద్దరి మధ్య వర్గపోరు ప్రారంభమైంది. ఇప్పుడు ఒకరంటే ఒకరికి పడని పరిస్థితి నెలకొంది. చిరు వ్యాపారుల పరామర్శలో భాగంగా బస్వరాజు సారయ్యపై కొండా మురళి చేసిన ఘాటు ఇప్పుడు నెట్టింట్ల వైరల్ గా మారాయి.

### బాధితులకు పరామర్శ..

రెండు రోజుల క్రితం రోడ్డుపైన వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారుల డబ్బాలను నగరపాలక సంస్థ సిబ్బంది తొలగించడం కొండా మురళి, బస్వరాజు సారయ్యల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి కారణమైంది. గురువారం 22వ డివిజన్ లో పర్యటించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సదరు చిరు వ్యాపారులను పరామర్శించారు. ప్రభుత్వం చేసిన నష్టానికి 11మంది బాధితులకు అండగా ఉంటానంటూ హామీ ఇవ్వడంతోపాటు మూడు వేల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందించారు. కొండా దంపతులు ఉన్నంతవరకు ఎవరికి అన్యాయం జరగనివ్వమంటూ హామీ ఇచ్చారు.

# జర్నలిస్ట్ తిరుపతిరెడ్డి హఠాన్మరణం

## ప్రెస్ క్లబ్ లో నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆంధ్రప్రభ బ్యూరో, సీనియర్ జర్నలిస్ట్ సిరిపురం తిరుపతి రెడ్డి గురువారం ఉదయం ఆరు గంటలకు హఠాన్మరణం చెందారు. హనుమకొండలోని కాకతీయ హాస్పిటల్ (మాక్స్ కేర్)లో చికిత్స పొందుతున్న తిరుపతిరెడ్డి అక్కడే తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ బాధ్యులు, జర్నలిస్టులు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అక్కడినుంచి తిరుపతి రెడ్డి మృతదేహాన్ని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కు తరలించారు. అక్కడే మాజీ ఎంఎల్సీ కొండా మురళీధర్ రావు మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి రూ.25 వేల ఆర్థికసాయం అందించడంతోపాటు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు బొడిగె శ్రీను, యాంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ పొడిచెట్టి విష్ణువర్ధన్, వివిధ యూనియన్ల నేతలు గడ్డం రాజిరెడ్డి, పిన్న శివకుమార్, దాసరి కృష్ణారెడ్డి, బీఆర్ లెనిన్, మస్కపురి సుధాకర్, మాడం రజినీకుమార్, దుర్గాప్రసాద్, కొరుకప్పుల నరేందర్, శ్రీధర్ రెడ్డి, నంబూద్రిపాద్, మచ్చిక అరుణ్, పొగాకుల అశోక్, దొంతు నవీన్, బండి పర్వతాలు, సది, ఆదర్శ్ గౌడ్, శివశంకర్, బాలాజీ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. తిరుపతిరెడ్డి అంతిమకార్యక్రమాలకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం తిరుపతిరెడ్డి మృత దేహాన్ని ఆయన స్వగ్రామం దుగ్గొండి మండలం నాచినపల్లికి అంబులెన్స్ లో తరలించారు. కాగా తిరుపతి రెడ్డి అకాల మృతికి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి ప్రఘాఢ సానుభూతి ప్రకటించారు.

# డోర్నకల్ సీడీపీఓగా లక్ష్మి నియామకం

## వరంగల్ వాయిస్ ఎఫెక్ట్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** స్త్రీ, శిశు సంక్షమ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న డోర్నకల్ ప్రాజెక్ట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ) లేకపోవటంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అగమ్య గోచరంగా మారిందంటూ వరంగల్ వాయిస్ బుధవారం ప్రచురించిన కధనానికి జిల్లా ఆధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ అద్వైధ్ కుమార్ సింగ్ అదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి రాయపుడి వరలక్ష్మి గురువారం డోర్నకల్ ప్రాజెక్ట్ కార్యాలయానికి విచ్చేశారు. మానుకోట బీఆర్బీలో డిప్యూటేషన్ పై కోనసాగుతున్న దేవరశెట్టి లక్ష్మికి ఇంచార్జి సీడీపీఓగా భాధ్యతలు అప్పగించారు. ఇంతే కాకుండా ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించి క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలంటూ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జూడాలకు కడియం కావ్య సంఘీభావం



**వరంగల్ వాయిస్, ఎంజీఎం :** పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసనకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గురువారం హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్ లో భద్రతను పెంచి, వైద్యులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** సెల్ ఫోన్ పోగొట్టుకుంటే ఇక నుంచి బాధపడాల్సిన అవసరం లేదని వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గతంలో వెంకటాపూర్ మండల పరిధిలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వారి వారి ఫోన్స్ ను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ హనుమకొండకు చెందిన మొలిగ చంద్ర శేఖర్ ఫిబ్రవరి 9న పాలంపేట గ్రామంలో తన ఫోన్ ను పోగొట్టుకున్నారని తెలిపారు. అదేవిధంగా చిన్నకోర్నెల్ గ్రామానికి చెందిన చింతల అనిల్ అనే కానిస్టేబుల్ సైతం తన మొబైల్ ను ఇటీవల పోగొట్టుకున్నాడని పేర్కొన్నారు. కాగా, సదురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇటీవల పోలీస్ శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వారు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను గుర్తించడం జరిగిందని తెలిపారు. గుర్తించిన ఫోన్స్ ను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని వెల్లడించారు. ప్రస్తుతం సెల్ ఫోన్ లేనిది ఎటువంటి కార్యకలాపాలు ముందుకు సాగడం లేదని, ప్రధానంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ వినియోగం ఎక్కువగా పెరిగిందన్నారు. ఇలాంటి క్రమంలో ఫోన్స్ పోతే చాలా మంది ఏం చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎవరివైనా ఫోన్లు పోయినట్లైయితే కొనుగోలు చేసిన ఆధారాలతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే పైసా ఖర్చు లేకుండా మీ ఫోన్స్ ను ట్రాకింగ్ చేసి అవి ఎక్కడ ఉన్నాయో గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## దుష్ప్రభావాలు లేనిది ఆయుర్వేద వైద్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎటువంటి దుష్ప్రభావాలు లేని ఆయుర్వేద వైద్యం అనాదిగా మన పూర్వీకులు విశ్వసిస్తున్నారని అని, వైద్య శాస్త్రాలకు మూలం ఈ ఆయుర్వేదమని సాయిబాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ అన్నారు. గురువారం కపిల్ ఆయుర్వేద చికిత్సాలయం వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ జోత్స్న వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలు చేశారు. నగరంలో ప్రబలుతున్న విష జ్వరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ భక్తులకు సూచించారు. అవసరం ఉన్న భక్తులకు ఉచిత మందుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర ధర్మకర్తలు రాకం సదానందం, వెయ్యిగండ్ల రమేష్, డాక్టర్ పూస సురేష్ కుమార్, కపిల్ సిబ్బంది మహేందర్ రెడ్డి, సునీత, రమేష్ పాల్గొన్నారు.

## పిల్లి అనిల్ కుమార్ గంగపుత్ర మరిన్ని అవార్డులు గెలుపొందాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆంధ్ర ప్రదేశ్ లోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ పోటీలలో 2024 సంవత్సరానికి ఫొటోగ్రఫీ విభాగంలో తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొమురవెల్లి మల్లన్న జాతరలో పసుపు జాతర అనే అంశంపై తీసిన ఫొటో మొదటి స్థానంలో నిలిచి ఉత్తమ ఫొటో గ్రాఫర్ గా అవార్డు అందుకున్న సందర్భంగా కాజీపేట్ లోని వారి స్వగృహంలో టుంగుటూరి రాజేష్ ఖన్నా కలిసి పిల్లి అనిల్ కుమార్ గంగపుత్రకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ పిల్లి అనిల్ కుమార్ గంగపుత్ర రానున్న రోజులలో జాతీయ, అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొని మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

# హర్యానా, జమ్మూకశ్మీర్‌లో బీజేపీకి గుణపాఠం తప్పదు

### సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లోక్‌సభ ఎన్నికల్లో 400లకు పైగా సీట్లు సాధించి అధికారంలోకి వస్తామని డాంభీకాలు పలికిన బీజేపీని ప్రజలు సగం సీట్లకు తగ్గించి తగిన గుణపాఠం చెప్పారని, త్వరలో జరగనున్న హర్యానా, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కూడా ప్రజలు ఓడించేందుకు సిద్దంగా ఉన్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా అన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ ఈ ప్రభుత్వం ఎంత కాలం ఉంటుందనేది ప్రశ్నార్థకమేనని, ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన చంద్రబాబు నాయుడు, నితీష్‌కుమార్ వారి వెంట ఎంత కాలం ఉంటారో కూడా తెలియదని అన్నారు. హనుమకొండలో మూడు రోజుల పాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనేందుకు రాజా గురువారం హనుమకొండకు వచ్చారు. ఈ సందర్భంగా హరిత హొటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, పశ్య పద్మ, కలవేణ శంకర్, వీఎస్.బోస్, ఎన్.బాలమల్లేష్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహాలతో కలిసి రాజా మాట్లాడారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేస్తున్నాయని, దేశంలో తీవ్రమైన సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని, రాజ్యాంగాన్ని విస్మరిస్తూ ఉద్యోగ నియామకాల్లో లాటరల్ ఎంట్రీ పేరుతో బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ప్రతినిధులను బ్యూరోక్రసీలో చొప్పించేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య శక్తులన్నీ కలిసి ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 26కు సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్నదని, దేశంలో సీపీఐ ఒక చోదక శక్తిగా ఎదిగిందని అన్నారు. అలాగే సెప్టెంబర్ 11 నుంచి 19 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, పశ్య పద్మ, బాగం హేమంత రావు,బాలమల్లేష్, కలవేణ శంకర్, బాల నర్సింహా, ఈటి నర్సింహా, వీఎస్ బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయ సారథి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## లెజెండరీ క్రికెటర్లకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థి దశలో పుష్కరకాలం క్రికెట్ ఆటను తమ బాల్, బ్యాట్ తో శాసించిన వైవి రాజేందర్ (రాజు), దొడ్డ విక్రం రెడ్డి, బండారు వేణులకు ఘన సన్మానం జరిగింది. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభాను రావు, క్రికెట్ కోచ్ అఫ్జల్, ప్రభాకర్ పప్పీ, కుమార్ తదితరులు ప్రత్యేక పంద్రాగస్టు పర్వదినాన్ని పురస్కరించుకొని లెజెండరీ క్రికెటర్ ను సన్మానిస్తున్నారు. సన్మాన గ్రహీతలు రాజు, విక్రమ్ రెడ్డి, వేణు గతంలో జిల్లా, యూనివర్సిటీల తరపున క్రికెట్ ఆడి ఎన్నో విజయాల్లో కీలక భూమిక పోషించారు. హనుమకొండలోని జేఎన్ఎస్ లో బుధవారం ఉదయభాను రావు వీరికి శాలువా కప్పి, మెమొంటోలు బహుకరించారు. కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమంలో జేఎన్ఐఎస్ బ్యాడ్మింటన్ కోచ్ కూరపాటి రమేష్ తో పాటు పూర్వ, వర్ధమాన క్రికెటర్లు పాల్గొన్నారు. ఎంతో నైపుణ్యం కలిగిన లెజెండ్ క్రికెటర్లను గుర్తించి ఉదయభాను బృందం సన్మానించడం పట్ల టీబీఏ ప్రధాన కార్యదర్శి కామిద్రి పవన్ బాబు, కోశాధికారి గడ్డం కేశవమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం షటిల్ క్రీడలో రాణిస్తూ, అందరికీ తలలో నాలుక లాగా మెదులుతున్న రాజు, విక్రం రెడ్డిలను సహచర క్రీడాకారులు అభినందించారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తనిఖీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను గురువారం పరకాల శాసనసభ్యుడురేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ల్యాబ్ లను పరిశీలించారు. పాలిటెక్నిక్ కళాశాల ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి కళాశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. కళాశాలలో విద్యా ప్రమాణాలు పాటించాలని, నాణ్యతతో కూడిన గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ని కంప్యూటర్లు అవసరమే తెలుసుకొని, కంప్యూటర్లు త్వరలో వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కళాశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కళాశాల ఆవరణలో ప్లాంటేషన్ పై దృష్టి పెట్టాలని తెలిపారు. సెప్టెంబర్ 3వ శనివారం పరకాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, పూర్వ విద్యార్థులు జాబ్ మేళాను ఉపయోగించుకొనేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సాంకేతిక విద్యను అందరికి అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ పరకాల ఆశయం విద్యార్థులను ఉత్తమ ఇంజినీర్లుగా తీర్చిదిద్దాలని, వారిని దేశ సమగ్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చేయాలనేది అన్నారు.

# జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ స్ఫూర్తితో ఉద్యమించాలి

### మరిపెడలో ఘనంగా వర్ధంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరవీరుడు జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ స్ఫూర్తితో హక్కుల సాధనకై ఉద్యమించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గందశిరి రవి, మండల అధ్యక్షుడు సత్తార్ పాషాలు పిలుపునిచ్చారు. గురువారం మరిపెడ పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో టీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు షోబుల్లాఖాన్ బాహ్య ప్రపంచానికి అంతగా తెలియని త్యాగధనుడు, నిర్భయ జర్నలిస్ట్, మత దూరహంకారానికి వ్యతిరేకి అని అన్నారు. అసమాన కలం యోధుడు షోయబుల్లా ఖాన్ పెత్తనానికి వ్యతిరేకంగా నైజాం రజాకార్ల, భూస్వాములకు వ్యతిరేకంగా అక్షరమే ఆయుధంగా ప్రజలను చైతన్యం చేశారన్నారు. ఎన్నో బెదిరింపులు వచ్చినప్పటికీ భయపడకుండా ప్రజా చైతన్యం కోసం, హైదరాబాద్ విముక్తి కోసం అలుపెరుగని పోరు కొనసాగించారు. ప్రజాస్వామ్య కాంక్షతో పెత్తందారుల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల కోసం జర్నలిజంలోకి వచ్చి కలంతో అప్పటి పాలకులను ఉక్కిరిబిక్కిరి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ముద్దుబిడ్డ షోయబుల్లాఖాన్ చరిత్రను నేటి తరాలకు తెలియజేసే విధంగా పాఠ్యపుస్తకాల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ గాడిపల్లి శ్రీశైలం, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్తర్ పాషా, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజేష్, జర్నలిస్టులు శ్రీనివాస్, వేణు, గోవర్ధన్, నాగేందర్, నాగరాజు, ఉపేందర్, సంజీవ్, శ్రీను, నాగరాజు, శ్రీకుమార్, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీశైలం, రవి, ప్రవీణ్, చారి, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
గురువారం 22, ఆగస్టు 2024
www.warangalvoice.net

# పిల్లల పెరుగుదలకు పౌష్టికాహారం అందించాలి

## హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, శాయంపేట :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని ప్రాథమిక సబ్ సెంటర్ ను గురువారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు. మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, షుగర్ టెస్టింగ్, బీపీ వంటి పరికరాలను పరిశీలించారు. డెంగీ కేసులు ఏమైనా నమోదు అయ్యాయా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాలలో ప్రజల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ సెంటర్-7 ను తనిఖీ చేశారు. మూత్రశాల లేకపోవడంతో త్వరగా నిర్మించాలని సూచించారు. పిల్లలు ఆడుకునే ఫ్రీ కిడ్స్ ను పరిశీలించారు. పిల్లలతో అక్షరాలను పలికించి కాసేపు ముచ్చటించి, రిజిస్టర్లను పరిశీలించారు. పిల్లల పెరుగుదలకు పౌష్టికాహారం అందించాలని చెప్పి, పిల్లల ఎత్తులను కొలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక సబ్ సెంటర్లో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన కిడ్స్, మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ కిడ్స్ పైన ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా పిల్లలు నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి నెల పిల్లలు ఎంత నేర్చుకుంటున్నారో అనే విషయాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. కోడిగుడ్ల కాంట్రాక్టర్ సరైన సమయంలో సరఫరా చేయడం లేదని అతనికి నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు చెప్పారు. డీఎంహెచ్ఓ లలితా దేవి, డీడబ్ల్యూఓ రాజమణి, సీడీపీఓ స్వాతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ సాయి కృష్ణ, ఎంపీడీవో ఫణీంద్ర, ఎంపీఓ రంజిత్ కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సునీత, మంజుల తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రైతులు బీజేపీ, బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు

## జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** రైతులకు ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీని స్వతంత్ర భారతదేశంలో మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్ కొనియాడారు. కొంతమేరకు డేటా ఆధార్ నెంబర్ లాంటివి తప్పులు ఉన్న రైతులవి మాత్రమే ఆగి ఉన్నాయన్నారు. వాటిని కూడా సవరించి తొందరల్లోనే అందరికీ ప్రతి రైతుకు రుణమాఫీని అమలు చేస్తామని ప్రభుత్వం మంత్రులు స్పష్టంగా చెప్పారని పేర్కొన్నారు. ఇంత పెద్ద సంక్షేమ పథకాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ వాళ్లు తట్టుకోలేక జీర్ణించుకోలేక ధర్నాలు చేసుకుంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. వీరి మోసపూరిత మాటలు రైతులు ఎవరు నమ్మద్దని జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ అన్నారు. బీఆర్ఎస్ కొందరికే నాలుగు దఫాలుగా చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని మండిపడ్డారు. రుణమాఫీ ఆధార్ సవరణ కోసం ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల పాలు చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ రుణమాఫీ గురించి ఎప్పుడు మాట్లాడలేదు, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎక్కడ అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా బీజేపీ, బీఆర్ఎస్ లు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. లేకుంటే రాష్ట్రంలో ప్రతిపక్ష హెూదా కూడా దక్కదని మండిపడ్డారు.

# విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ వితరణ



**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా నర్మెట మండలంలోని హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ జనగామకు చెందిన జోన్ చైర్మన్ ఫజ్జూరి జయహరి సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, టై, బెల్ట్, ఐడీ కార్డులు, పెన్నులు,పెన్సిళ్లు, స్టేషనరీలను వితరణ జేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ మాట్లాడుతూ జోన్ చైర్మన్ పజ్జూరి జయహరి తాను పుట్టిన గ్రామానికి ఎంతో కొంత సహకారం చేయాలని, తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో వారి అవసరాలను తీర్చడానికి తోడ్పడితే వారు జీవితాంతం గుర్తు పెట్టుకోవడమే కాకుండా వారు ఉన్నత స్థానాలకు ఎదిగిన తర్వాత ఎంతోమంది పేదలను ఆదుకోవడానికి ముందుంటారని తెలిపారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అవసరాలను తీర్చడం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. దాత పజ్జూరి జయహరిని అభినందిస్తూ ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వి.ఆశలత, లయన్స్ క్లబ్ జనగామ ట్రెజరర్ కృష్ణ జీవన్ బజాజ్, మెంబర్ చిదురాల బాబు, తాజా మాజీ సర్పంచ్ పగడాల విజయ, గ్రామ పెద్దలు పగడాల నరసింహులు, ఉపాధ్యాయులు పి.విద్యావతి, పి.లలిత, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



**వరంగల్ వాయిస్, నడికూడ :** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ సీపీఆర్ (కార్డియో ఫెల్మినరీ రిసోసియేషన్) పై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కలిగించారు. కరోనా వచ్చిపోయిన సందర్భంలో ఇటీవల కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా వస్తున్నటువంటి గుండె జబ్బుల పై వివరణ ఇస్తూ, హఠాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు చేసేటువంటి ప్రథమ చికిత్స సీపీఆర్ పై విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్పించడం జరిగింది. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు ప్రత్యక్షంగా నేర్చుకున్నటువంటి విషయాలను జీవితకాలం గుర్తుపెట్టుకొని సందర్భం వచ్చినప్పుడు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ సీపీఆర్ పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. సీపీఆర్ చేసేటప్పుడు కొన్ని పద్ధతులు కూడా విద్యార్థులకు నేర్పించారు.

# వైద్య విద్యార్థిని ఉదంతంపై సుప్రీం స్పందన హర్షనీయం

## వకుళాభరణం కృష్ణ మోహన్ రావు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** దేశాన్ని దిగ్భ్రాంతికి లోను చేసిన కలకత్తా జూనియర్ డాక్టర్ సంఘటనపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్ర చూడ్ సుమోటోగా స్పందించి తగు కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామమని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ అన్నారు. గురువారం నెక్లెస్ రోడ్డు మీదుగా కమిషన్ కార్యాలయం వెళ్తున్న చైర్మన్ డాక్టర్ వకుళాభరణం వాహనాన్ని జూడా ప్రతినిధులు అడ్డగించారు. తాము చేస్తున్న న్యాయ పోరాటానికి సంఘీభావం ప్రకటించాలని జూడా ప్రతినిధులు ఆయనను కోరారు. వారి విజ్ఞప్తి మేరకు డాక్టర్ వకుళాభరణం జూనియర్ డాక్టర్లు ధర్నా చేస్తున్న పీపుల్స్ ప్లాజాకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఈ హత్య ఉదంతం అమానవీయమైనదని అన్నారు. దేశవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు కోరుతున్నట్లు కేంద్రం వెంటనే కేంద్ర పరిరక్షణ చట్టం అమలులోకి తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాను ఒక సామాజిక బాధ్యత కలిగిన పౌరుడిగా మాత్రమే వచ్చి సంఘీభావం తెలుపుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో మెడికల్ అడ్మిషన్లు, ఉద్యోగ నియామకాలలో బీసి రిజర్వేషన్ల అమలులో ఏవైనా లోపాలు ఏర్పడినపుడు కమిషన్ దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి తప్పక సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

# లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్‌కు సత్కారం



**వరంగల్ వాయిస్, శివనగర్ :** జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గా నియమితులైన న్యాయవాది శామంతుల శ్రీనివాస్ ను గురువారం శివనగర్ స్థానిక 34వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా శాలువాలతో సన్మా నించారు. స్థానిక సమస్యలపై కాంగ్రెస్ పార్టీ తరపున ఎప్పటికప్పుడు పరిష్కరించుటకు కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా అధ్యక్షురాలు రావుల విజయ రాంచందర్, డివిజన్ నాయకులు పట్టూరి సుధాకర్, రాధిక, ముత్తినేని మధు, విజయ్, రాజేష్, వెంకన్న, శ్రీధర్ కిరణ్ పాల్గొన్నారు.

# శ్యామ్ సుందర్, రజితలకు ఆత్మీయ వీడ్కోలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత 12 సంవత్సరాల నుంచి ఎంజీఎం ఎస్ఎన్ సీయూ ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేసి శ్యామ్ సుందర్, రజితలు తెలంగాణ డయాగ్నస్టిక్స్ (టీ.హబ్) నర్సంపేటకు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్లున్న ఎస్ఎన్ సీయూ స్టాఫ్ రజిత, శ్యామ్ సుందర్ లను ఘనంగా ఎస్ఎన్ సీయూ స్టాఫ్ సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్ ఖన్నా హాజరై మాట్లాడుతూ వారు చేసిన సేవలు విలువైనవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువనేత మురళి మోహన్, సుధ, పృథ్వీరాజ్, సుధారాణి, రామా సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ అమ్మ పేరున చెట్టు నాటాలి

## మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహెూత్సవం కార్యక్రమంలో భాగంగా పరకాల మండల పరిధిలోని అన్ని గ్రామాలలో 50కి తగ్గకుండా వారి అమ్మ పేరుమీద మొక్కలు నాటారు. కామారెడ్డిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో "నాటుదాం ఒక చెట్టు - అమ్మ పేరుమీద " కార్యక్రమంలో పాల్గొని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మండల ఆంజనేయులుతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం లోపించడం వలన సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఉష్ణోగ్రతలు పెరగడం, ప్లేట్లేట్స్ తగ్గి రకరకాల రోగాల బారిన పడి మనుషులు పిట్టల్లా రాలిపోతున్నారని అన్నారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరుమీద మొక్కలు నాటి వాటిని కాపాడాలని పిలుపునిచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు భిక్షపతి, ఉపాధ్యాయులు విద్యార్థులు, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, ఫీల్డ్ అసిస్టెంట్ ఈజీఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకంగా రుణమాఫీ అమలు చేయాలి

## మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రుణ మాఫీ పథకంతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. అర్హులైన రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ పథకం వర్తింప చేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యవతి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి కొర్రీలు లేకుండా పారదర్శకంగా రైతులందరికీ రూ. 2లక్షల రుణాలు మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రుణమాఫీ అమలు చేసే వరకు రైతులకు అండగా ఉండి పోరాడుతామన్నారు. ఒకే దఫాలో రుణమాఫీని అమలు చేస్తామని, మూడు దశలుగా అమలు చేసినా రైతులకు నిరాశ, నిస్పృహలే ఎదురయ్యాయని, ఇది మాఫీ కాదు మోసమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఒక లక్ష లోపు రుణాలను 36 లక్షల మంది రైతులకు రుణ మాఫీ చేస్తే , కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ. 2 లక్షల రుణ మాఫీని కేవలం 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల 330 కోట్ల రుణ మాఫీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా 15 వేల కోట్ల రూపాయలు నేటికీ అమలు చేయలేదని వాపోయారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని లేకుంటే రాష్ట వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, బీఆర్ఎస్ నేతలు, వార్డు మెంబర్లు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రుణమాఫీ మోసంపై బీఆర్ఎస్ రణం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తొర్రూరు మండల కేంద్రంలో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి మీద బీఆర్ఎస్ మండల, పట్టణ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో జాతీయ రహదారి మీద రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ భారీ ధర్నా చేసిన తొర్రూరు బీఆర్ఎస్ మండల, పట్టణ పార్టీ నాయకులు అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ ఎగ్గొట్టి రైతులతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. మొదటగా రైతు రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరం అని చెప్పి, మళ్లీ మాట మార్చి కేబినెట్ లో 31వేల కోట్లు సరిపోతాయని చెప్పి, మళ్లీ మాట మార్చి బడ్జెట్ లో కేటాయించింది కేవలం 26 వేల కోట్లు మాత్రమే ఇందులో కూడా మూడు విడతల వారీగా చివరగా చేసిన రుణమాఫీ కేవలం 17వేల కోట్లు మాత్రమే ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటిమాటికి మాట మార్చి రైతులను మోసం చేస్తున్న విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రుణమాఫీ కాక ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు తాము తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, అలాగే ఈ సందర్భంగా రైతులు పిలుపునిచ్చినటువంటి ధర్నాకు తాను మద్దతు తెలుపుతున్నానని తెలిపారు. ఆరు కాలం కష్టపడి పండించిన రైతుకు ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతుల పట్ల చిన్నచూపు చూస్తూనే ఉంది, పాలకుర్తి నియోజకవర్గంలో కనీసం పంట పండించుకునేందుకు రైతులకు సాగునీరు కూడా అందీయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది, వెంటనే ప్రభుత్వం దిగివచ్చి పూర్తిగా రుణమాఫీ చేసి అలాగే రైతులకు సాగునీరు అంది ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జడ్పీటీసీ జిల్లా ఫ్లోర్ లీడర్, పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రుణమాఫీ కానీ రైతులు పాల్గొన్నారు.

# కేంద్ర సంఘం నేతలను కలిసిన టీఎన్జీఓస్ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నాంపల్లిలోని టీఎన్జీఓస్ భవన్ లో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ లను హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న కేంద్ర సంఘ నాయకత్వానికి అభినందనలు తెలుపుతూ ట్రాన్స్ఫర్ లలో ఉద్యోగులకు న్యాయం జరిగేలా చేసిన నాయకత్వానికి హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ నేతలు మోయిజ్, లక్ష్మి ప్రసాద్, రాజేష్ ఖన్నా, గౌతం, లక్ష్మణ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# చేసింది గోరంత.. చెప్పేది కొండంత

## మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ విషయంలో అంకెల గారడి చేసి మాఫీ పూర్తయిందని సంబరాలు చేసుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గోరంత చెప్పేది కొండంత అని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. గురువారం మరిపెడ పట్టణ కేంద్రంలో హైవేపై గాంధీ విగ్రహం ముందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 లక్షల రుణమాఫీలో సగం మందికి కూడా రుణమాఫీ కాక రైతులు గోస పడుతున్నారని, అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ పనులు వదిలి చేతుల్లో కాగితాలు పట్టుకుని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, ఎంత అప్పు ఉన్న రూ.2లక్షలే మాఫీ అయితదని, మిగతావి కడితేనే మాఫీ వర్తిస్తుందని బ్యాంకు అధికారులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారాని తెలిపారు. ఈ ప్రభుత్వానికి అన్నదాతల ఉసురు తగులుతుందన్నారు. మొదట రైతు రుణమాఫీకి 49,500 కోట్లు అవసరం అని చెప్పి మళ్లీ మాట మార్చి క్యాబినెట్ లో 31 వేల కోట్లు సరిపోతాయని చెప్పిన సీఎం మాట మార్చి బడ్జెట్ లో కేటాయించింది కేవలం 26 వేల కోట్లు మాత్రమేనన్నారు. ఇందులో కూడా మూడు విడతల వారీగా చివర చేసిన రుణమాఫీ కేవలం 17 వేల కోట్లు మాత్రమేనని తెలిపారు. బీఆర్ ఎస్ పార్టీ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. రైతులందరికీ రుణమాఫీ అయ్యేవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని, రైతులంతా బీఆర్ఎస్ తో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు, మున్సిపల్ చైర్మన్ గుగులోత్ సింధూర రవి నాయక్, పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు,జిల్లా నాయకులు రాంబాబు, వెంకన్న, రవీందర్, మాణిక్యం, అశోక్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కాలు నాయక్, మక్సుద్, లతీఫ్, మరిపెడ కౌన్సెలర్లు పరశురాములు, రేఖ లలిత వెంకటేస్వర్లు, హత్తిరామ్ నాయక్, బాలాజీ, శ్రీను, దిగజేర్ల శ్రీను, హుస్సేన్, వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారం సరికాదు

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారం సరికాదని, 8 నెలల ప్రజాపాలనలో ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ దొంగ ధర్నాలు, దీక్షలు, రాస్తారోకోలు చేస్తుందని, ప్రజలెవరూ మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం పట్టణ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం తగదని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన రైతులకు తప్పకుండా రుణమాఫీ చేస్తామని చెప్పారు. పదేళ్లలో ఏనాడూ రైతుల గురించి మాట్లాడని కేటీఆర్ కు రైతు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదని, ధర్నాలు, రాస్తారోకోలు చేయాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేని వారు అధికారం కోల్పోయిన తర్వాత రైతులను ఆందోళనకు గురిచేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికలల్లో ప్రజలు బీఆర్ఎస్ కు గుండు సున్నా వేశారని, ఇప్పుడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో డబుల్ సున్నాలు వేస్తారని ఎద్దేవా చేశారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షణ రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి మొత్తం మూడు విడతలతో ప్రభుత్వం రుణమాఫీ చేసిందని తెలిపారు. చిన్న చిన్న పొరపాట్లతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, అటువంటి రైతుల నుంచి ఫిర్యాదు తీసుకుని క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. త్వరలోనే రైతులందరికీ కూడా రుణమాఫీ ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కౌన్సులర్లు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.

# పట్టా పాస్ బుక్ లేని రైతుల రుణాలను మాఫీ చేయాలి




**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు, జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాలు ఏకకాలంలో మాఫీ చేయడం సంతోషకరమైన విషయమేనన్నారు. అదే సమయంలో పట్టాదార్ పాస్ బుక్ లేకపోయినా పహనీ నకల్ ఆధారంగా రుణాలను ఇచ్చారన్నారు. కానీ, ప్రభుత్వం వీరిని విస్మరించడం వల్ల చాలా మంది నిజమైన రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకూడదంటే వెంటనే పహనీల ద్వారా పంట రుణాలు పొందిన రైతుల రుణాలను వెంటనే మాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వారు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు ఎండీ అంజద్ పాషా, ఇంజం కొమురయ్య, గుంజె శ్రీనివాస్, మాతంగి శ్యాంసుందర్, వడి సారయ్య, జక్కుల అయిలయ్య, మామిడి నటరాజ్, భూక్య రూప్ సింగ్, సీడం సమ్మయ్య, ముత్తయ్య, మర్రి స్వామి, కుక్కల రవి, ఈసం మహేందర్, లక్ష్మి నారాయణ, భక్కన్న, మేకల సాంబయ్య, కట్ల నరేష్, మహరాజు నారాయణ, ఆగబోయిన సాంబయ్య, వట్టం సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్



**వరంగల్ వాయిస్, సుబేదారి :** అంతర్ రాష్ట్ర ఘరానా మోసాలకు పాల్పడుతున్న ముఠాను సుబేదారి, టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుబేదారి ఇన్ స్పెక్టర్ పి.సత్యనారాయణ వివరాలను వెల్లడిస్తూ ఘరానా మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర నిందితులు ఒకరు నిమిత్ కపాసి, మరొకరు సుమన్ కపాసి అను వ్యక్తులు హిందీ, గుజరాతీ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషలలో అనర్గళంగా మాట్లాడుతూ నకిలీ ఐడెంటిటీ కార్డ్స్, సీబీఐ ఐడెంటిటీ కార్డ్స్, బ్యాంక్ మేనేజర్ ఐడెంటిటీ కార్డ్స్, ప్రెస్ కార్డ్ లను చూపిస్తూ పరిచయం చేసుకొని అమాయకులను షేర్ మార్కెట్ లలో పెట్టుబడి అని, వివిధ కంపెనీలలో పెట్టుబడి పేరుతో కోట్లలో మోసం చేస్తూ హైదరాబాద్, పూణే, విశాఖ పట్నం,వరంగల్ మొదలగు నగరాలలో చాలా మందిని మోసం చేశారని తెలిపారు. జులైవాడకు చెందినా సయ్యద్ రియాజ్ అను వ్యక్తి, ప్రవీణ్ కుమార్ లను స్పీకింగ్ సీస్ కన్సల్టెంట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, మాట్రిమోనీ, ఓవర్సీస్ కన్సల్టెన్సీ, బ్యాంకు లోన్స్, షేర్ మార్కెట్, జాబ్స్ ఇప్పిస్తానని చెప్పి కొంత మంది బాధితుల నుంచి రూ.1,34,00,000 తీసుకొని మోసం చేసి పారిపోయారు. దీంతో గురువారం సమాచారం మేరకు సాయి నగర్ కాలనీలో అరెస్ట్ చేసి అతడి వద్ద నకిలీ సీబీఐ ఐడెంటిటీ కార్డ్, ప్రెస్ కార్డ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఐడెంటిటీ కార్డ్, నకిలీ ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఐడెంటిటీ కార్డ్స్, గోల్డ్ రింగ్, రూ.7,800, మూడు నకిలీ బ్యాంక్ చెక్కులు స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

# ప్రజలకు జవాబుదారీగా ఉంటేనే ప్రభుత్వాలకు మనుగడ

## రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రజలకు జవాబుదారీగా మసులుకుంటేనే ప్రభుత్వాలు మనుగడ కొనసాగించగలవని, ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజలు ప్రభుత్వాలను, పాలకులను విస్మరిస్తారనే విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలని సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. గురువారం సీపీఐ ఎం.ఎల్ మాస్ లైన్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని" డిమాండ్ చేస్తూ వేలాది మందితో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి. హర గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వాల వలే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని గుర్తు చేశారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని పేద దళిత, గిరిజన ,బడుగు, బలహీన అణగారిన వర్గాల ప్రజలకు కనీసం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, దీంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, ఇళ్ల స్థలాలు, పక్కా ఇండ్లు లేని అభాగ్యులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు మరింత ఉధృతం చేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రన్న, కేజీ రామచందర్, కే.రమ, కెచ్చల రంగారెడ్డి, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, వనమాల కృష్ణ, వి.ప్రభాకర్, ఆవుల వెంకటేశ్వర్లు, చంద్ర అరుణ, గద్దం సదానందం, కే.సూర్యం, నంది రామయ్య, ఎన్.ఎల్ పద్మ, హన్మేష్, రాష్ట్ర నాయకులు సీవై. పుల్లన్న, ఇప్టూ రామయ్య, కొత్తపల్లి రవి ,ఆవుల అశోక్ లు ప్రసంగించగా ప్రజాసంఘాల నాయకులు కే.ఎస్.ప్రదీప్, జూపాక శ్రీను, చిర్ర సూరి, ఎస్ నాగేశ్వరరావు, పెద్దింటి రామకృష్ణ, బి.నరసింహారావు, సాయి, ప్రవీణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీల తలరాతలు మారాలంటే కులగణన జరగాలి

## సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** బీసీల తలరాతలు మారాలంటే కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో.. బీసీల కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే బీసీ కులగణన చేపట్టాలని, ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మహేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై వివక్షత చూపుతున్నాయన్నారు. ఓబీసీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఆయన వివరించారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి నేటికీ బీసీ కులగణన జరపలేదన్నారు. భారతదేశాన్ని పాలించిన తెల్లదొరలు ఓబీసీ గణన చేశారే తప్ప..స్వతంత్ర భారతదేశంలో బీసీ కులగణనకు నోచుకోలేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ఫలితంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అనేకమంది ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేస్తామని మాట ఇచ్చి..కేబినెట్ లో తీర్మానం చేసిందే తప్ప ఇప్పటివరకు కార్యాచరణ చేపట్టలేదన్నారు. బీసీ కులగణన చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దన్నారు. బీసీలందరి తలరాతలు మారాలంటే తప్పనిసరిగా కేంద్రంలో జనగణనలో ఓబీసీ కులగణన, రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# జానపద కళల్ని కాపాడాలి

## ప్రపంచ జానపద దినోత్సవంలో వక్తలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ రోడ్డులోని బాపూజీ హాల్ లో సీనియర్ కళాకారులకు సన్మాన కర్యక్రమం ఘనంగా జరిగింది. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా సీనియర్ కళాకారులకు సన్మాన కార్యక్రమం సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షులు గద్దం సుధాకర్ అధ్యక్షతన జరిగింది. నేటి ఆధునిక కాలంలోని టీవీ సినిమాకు మూలం మన జానపద కళారూపాల్లో ఉందని నాటి తోలు బొమ్మలాటనే నేటి సినిమా అని, కానీ నేటి సమాజంలో జానపద కళారూపాలకు ఆదరణ కరువైందని, అంతరించి పోతున్న జానపద కళారూపాలను కాపాడుకోవాలని, కళారూపాలకు ఆదరణ కరువై పోషణ కరువైన కళాకారులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా కళాకారులకు చేయూత అందించే ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరువాత తెలంగాణ ఉద్యమ కళాకారులు బుల్లెట్ వెంకన్న మాట్లాడుతూ ప్రజల వెన్నంటి ఉండి ప్రతి సందర్భంలో ఉద్యమానికి ఊతంగా నిలబడింది పాట అని చెప్పారు. అనంతరం సీనియర్ కళాకారులకు సన్మాన కార్యక్రమం చేశారు. సీనియర్ కళాకారులు లింగాల ఇమ్మనియేల్, గద్దం శరత్, తోట రవి, సమ్మక్క, అమ్మ కుమార్, అగస్టిన్, కరుణాకర్ నరసింహ స్వామి, కుమార్, కుంట ఉప్పలయ్య పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంటి ముదిరాజ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ గురువారం చంటి ముదిరాజ్ కు నియామక పత్రాన్నిఅందజేశారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ కు, జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారీతనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్ కు అప్పీల్ చేసుకోవాలన్నారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికా రులపై చర్యలు తీసుకుంటుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులు, నంగునూరు మండల అధ్యక్షులు అశోక్ యాదవ్, గుండెల రాయుడు, బోడాస్ జగన్, ఎండీ మున్నా, జి.భానుప్రసాద్, వెంకటేష్ యాదవ్, నమిండ్ల హరీష్ పాల్గొన్నారు.

# ఎలకంటి సతీష్ మృతి తీరని లోటు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** టౌన్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎలకంటి సతీష్ అకాల మరణం చెందినందున గురువారం దశదిన కార్యక్రమం చార్ బౌలిలోని ఎమ్మెస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు దేవరకొండ నరేందర్ రావు నాయి, రాష్ట్ర నాయకులు యాక నారాయణ, రాచాల సతీష్, నాయి శ్రీరాముల సురేష్, కొలనుపాక కుమార్ స్వామి, అల్వాల అధ్యక్షుడు విష్ణు నాయి, మేడ్చల్ అధ్యక్షుడు మధు నాయా, హైదరాబాద్ జంట నగరాల అధ్యక్షులు రాకేష్ నాయి, వరంగల్ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎడ్ల మురళి, కార్పొరేటర్ ఎలకంటి రాములు, జిల్లా నాయకులు, నగర నాయకులు, నియోజకవర్గ నాయకులు ఎలకంటి సతీష్ సంఘానికి చేసిన సేవలను గుర్తు చేసుకుని వారి మరణం సంఘానికి తీరని లోటని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని భావిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని మహబూబాబాద్ జిల్లా జడ్పీ సీఈవో నర్మద అన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద అనే కార్యక్రమం తొర్రూరు మండలం అమ్మాపురం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ సీఈవో నర్మద మాట్లాడుతూ పల్లెలను పచ్చదనంగా మారుస్తూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేయడంలో భాగంగ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమం చేపట్టిందని వారు తెలిపారు. ఎంపీడీవో వేణుమాధవ్, ఈజీఎస్ ఈసీ బిందు, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, తొర్రూర్ ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది వి.వినయ్ కుమార్, ఉన్నత ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మంజుల, యాకూబ్ రెడ్డి, ఈజీఎస్ టీఏలు కిషన్, సుధాకర్ ఫీల్డ్ అసిస్టెంట్ గూడెల్లి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ కార్యాలయ సందర్శన



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ వ్యవసాయ కార్యాలయాన్ని డీఏఓ ఎం.విజయ నిర్మల గురువారం సందర్శించారు. ఇటీవల నూతనంగా డీఏఓగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా మరిపెడ వ్యవసాయ కార్యాలయానికి వచ్చారు. అలాగే బదిలీపై వచ్చిన కే.విజయ చంద్ర మరిపెడ ఏడీఏగా బాధ్యతలు స్వీకరించారు. డీఏఓ ఎం.విజయ నిర్మలకు, ఏడీఏ విజయ చంద్రలను మరిపెడ వ్యవసాయ శాఖ అధికారులు బొకే అందజేసి శాలువాతో వారిని ఘనంగా సన్మానించారు. వ్యవసాయ శాఖ మండల అధికారులు వీరాసింగ్, వాహిని, వినయ్ కుమార్, మండల వ్యవసాయఅధికారులు, ఆయా గ్రామాల విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, మడికొండ :** వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ పరిధిలోని మడికొండ గ్రామానికి చెందిన హనుమకొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా కార్యదర్శి దరావత్ సునీల్ కుమార్ గుండెపోటుతో మరణించగా బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్ వారి ఇంటికి వెళ్లి వారి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం మహేందర్, జిల్లా నాయకులు పోనగోటి వెంకట్ రావు, ముత్తోజు సురేష్, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్, కొలిపాక కుమార్ బాబు, భైరపాక వెంకటేష్, గద్దం కిరణ్, అరవింద్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# చీరలో మిల్క్ బ్యూటీ గ్లామర్ బ్లాస్ట్



స్టార్ హీరోయిన్ తమన్నా సౌత్ మరియు బాలీవుడ్ పరిశ్రమల్లో మంచి క్రేజ్ ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. కథానాయికగా ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు చేసిన ఆమె గత కొంతకాలంగా స్పెషల్ సాంగ్స్ తోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. తనకు ఉన్న గ్రేస్‌ఫుల్ డ్యాన్స్ స్కిల్స్ తో ఏ సినిమాలో ఐటెం సాంగ్ చేసినా, సినిమా హిట్ అయ్యే అవకాశం పెరుగుతుందని అనిపిస్తుంటుంది.కెరీర్ మొదట్లోనే, బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటించిన 'అల్లుడు శీను' చిత్రంలోని "లబ్బర్ బొమ్మ" పాటలో తన డ్యాన్స్ తో ప్రేక్షకులను ఎట్రాక్ట్ చేసింది. తర్వాత "జై లవకుశ", "గని", "స్పీడున్నోడు" వంటి చిత్రాలలో చేసిన స్పెషల్ సాంగ్స్ కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షించాయి. అయితే, ఆ మధ్య విడుదలైన సూపర్ స్టార్ రజినీకాంత్ "జైలర్" సినిమాలోని "నువ్వు కావాలయ్యా" పాటలో తమన్నా గ్లామర్ షోతో మరోసారి తన ప్రత్యేకతను చూపించింది. ఈ పాటకు వచ్చిన సక్సెస్ సినిమాకు ముందస్తు హైప్ ను పెంచడంలో కీలక పాత్ర పోషించింది. అంతే కాదు, తమన్నా పెంచిన గ్లామర్ డోస్ వల్ల పాట ట్రెండింగ్‌లో నిలిచింది. తాజాగా తమన్నా మరో స్పెషల్ సాంగ్ తో సందడి చేసిన విషయం తెలిసిందే. ఈసారి బాలీవుడ్ లో స్త్రీ 2 మూవీలో "ఆజ్ కా రాత్" అనే స్పెషల్ సాంగ్ లో చిందులేసింది. 2018లో విడుదలైన 'స్త్రీ' మూవీలో నోరా ఫతేహి ఐటెం సాంగ్ చేస్తే, ఇప్పుడు సీక్వెల్ లో తమన్నా గ్లామర్ తో అదరగొట్టింది. ఇక సోషల్ మీడియాలో కూడా అమ్మడు తన గ్లామర్ తో ట్రెండ్ అవుతోంది. రీసెంట్ గా ఫొటో షూట్ లో అమ్మడు చీరలో మాయ చేసేసింది. ఒక స్టిల్ లో చీరకొంగు పై అలా నీళ్ళు చల్లుతూ కనిపించింది. గతంలో ఎన్నోసార్లు గ్లామర్ స్టిల్స్ ఇచ్చిన అమ్మడు ఈ రేంజ్ లో మ్యాజిక్ చేయలేదని కొందరు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ప్రస్తుతం తమన్నా స్పెషల్ సాంగ్స్ తోనూ దూసుకెళ్తోంది.



# 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'..

## సరైన టైమ్ లో బూస్ట్ ఇచ్చిన బన్నీ

ఆగస్టు నెలలో వచ్చిన చిన్న చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు అందుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వచ్చిన 'అయ్' మరియు 'కమిటీ కుర్రోళ్ళు' చిన్న చిత్రాలుగా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకొని మంచి హిట్స్ గా నిలిచాయి. ఇప్పుడు అదే ట్రాక్ లో రాబోతున్న సినిమా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'. ఇది మరొక కామెడీ ఎంటర్టైనర్ కావడంతో మంచి అంచనాలను ఏర్పరచుకుంది. ముఖ్యంగా రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంపై హైప్ పెరగడానికి మరో కారణం అల్లు అర్జున్ సపోర్ట్. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు బన్నీ హాజరై తన సపోర్ట్ ప్రకటించడమే కాకుండా, తన స్పీచ్ తో మరింత ఉత్సాహాన్ని పెంచాడు. అల్లు అర్జున్ ఈ వేడుకలో చేసిన ఉపన్యాసం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇష్టమైన వారి కోసం తాను ఎప్పటికప్పుడు ముందుకొస్తానని చెప్పిన బన్నీ, రావు రమేష్ సహా ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రశంసించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బన్నీ ఇచ్చిన స్పీచ్ సోషల్ మీడియాలో ఎందరో ఫ్యాన్స్ ను ఆకర్షిస్తోంది. ముఖ్యంగా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' పై ఈ ప్రసంగం మరింత ఆసక్తి కలిగించిందని చెప్పవచ్చు. ట్రైలర్ ద్వారా ఇప్పటికే ఈ సినిమాపై పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ అయ్యాయి. రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఒక కామెడీ మూవీగా రూపొందింది. రావు రమేష్ అకౌంట్ లో అకస్మాత్తుగా డబ్బులు క్రెడిట్ అవడం, ఆ పరిణామాల చుట్టూ కథ నడవడం ఆసక్తికరంగా ఉంటుందట. ఇందులో కామెడీ ఎలిమెంట్స్ చాలా బాగున్నాయని ట్రైలర్ తో ఒక నమ్మకాన్ని కలిగించారు. ఇటీవల కాలంలో తెలుగు ప్రేక్షకులు ఇలాంటి కామెడీ చిత్రాలకు మంచి సపోర్ట్ అందిస్తున్నారు. దీంతో, 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' కూడా అదే లైన్లో విజయం సాధించవచ్చని అనిపిస్తోంది. ఈ సినిమా లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో రూపొందింది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య కలిసి నిర్మించిన ఈ చిత్రాన్ని పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను థియేట్రికల్ హక్కులను కొనుగోలు చేసి గ్రాండ్ గా విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. తబితా సుకుమార్ సమర్పణలో తొలి చిత్రంగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం విశేషం. దర్శకుడు సుకుమార్ మరియు అల్లు అర్జున్ ఈ చిత్రానికి ముఖ్య అతిథులుగా రావడంతో మంచి క్రేజ్ ఏర్పడింది. ఇక సినిమాను ఈ నెల 23న గ్రాండ్ గా విడుదల చేయబోతున్నారు.

# రాత్రికి రాత్రే..

## ఓవర్ నైట్‌లో బ్యూటీ తలరాతే మారిపోయింది



ఇమాన్వీ ఇస్మాయిల్... మొన్నటి వరకు ఈ పేరు పెద్దగా ఎవరికీ పరిచయం లేదు. అయితే ఒక్క ఫొటోతో ఈ బ్యూటీ తలరాతే మారిపోయింది. ఓవర్ నైట్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారిపోయింది. ప్రభాస్, హనురాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో ప్రభాస్‌కు జోడిగా.. ఇమాన్వీ ఇస్మాయిల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. అప్పటి వరకు కేవలం యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లకు మాత్రమే పరిమితమైన ఈ బ్యూటీపై ఒక్కసారిగా ఇండస్ట్రీ దృష్టి పడింది. సీతారామం చిత్రంతో మృణాల్‌ను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసిన హను రాఘవపూడి, ఇప్పుడు మరో బ్యూటీని ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు. ఇటీవల సినిమా పూజా కార్యక్రమంలో ప్రభాస్‌తో దిగిన ఫొటోతో ఇమాన్వీ ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఒక్కసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ బ్యూటీ ఫాలోవర్ల సంఖ్య ఏకంగా లక్ష మంది ఫాలోవర్లు పెరిగిపోయారు. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ బ్యూటీ గురించే చర్చ నడుస్తోంది. ఇంకా సినిమా షూటింగ్ కూడా ప్రాంరభమవ్వకముందే ఇమాన్వీకి ఆఫర్లు క్యూ కడుతున్నాయని తెలుస్తోంది. బడ నిర్మాతాలు తమ తదుపరి చిత్రాల్లో హీరోయిన్‌గా ఇమాన్వీని తీసుకోవడానికి అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారని తెలుస్తోంది. అయితే ప్రభాస్‌తో సినిమా పూర్తయ్యేంత వరకు మరో సినిమాకు అంగీకరిచకూడదని దర్శకుడు హను రాఘవపూడి ఒక కండిషన్ పెట్టాడని సమాచారం. అంతేకాకుండా మైత్రీ మూవీ మేకర్స్ వరుసగా మూడు సినిమాలు తమ ప్రొడక్షన్ హౌజ్‌లోనే చేసేలా అగ్రిమెంట్ చేసుకున్నారని కూడా వార్తలు వస్తున్నాయి. ఏది ఏమైనా ఈ బ్యూటీ లైఫ్ మాత్రం ఒక్క రోజులోనే మారిపోయిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇకా సినిమా షూటింగ్ కూడా మొదలవ్వకముందే.. ఇమాన్వీకి వరుస ఆఫర్లు క్యూ కడుతున్నట్లు వార్తలు వస్తుండడంతో రాత్రికి రాత్రి ఈ బ్యూటీ ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయింది. మరి ప్రభాస్ సినిమా తర్వాత ఇమాన్వీ క్రేజ్ ఎంతలా పెరుగుతుందో చూడాలి. ఇదిలా ఉంటే ప్రభాస్, హను రాఘవపూడి కాంబినేషన్‌లో వస్తున్న సినిమాను స్వాతంత్రానికి ముందు జరిగిన సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించి విడుదల చేసిన కాన్సెప్ట్ ఫొటో సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.




# ఫ్యాన్స్‌లో మరింత జోష్

## 'విశ్వంభర' పోస్టర్ వచ్చేసింది

పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ.. ఫ్యాన్స్‌లో మరింత జోష్ నింపేందుకు విశ్వంభర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది యూవీ క్రియేషన్స్ సంస్థ. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారీ సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'. 'బింబిసార' విజయం తర్వాత వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. విక్రమ్, వంశీధర్ రెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ నిర్మాతలు. త్రిష, ఆషిక రంగనాథ్ ఈ సినిమాలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ రోజు చిరంజీవి బర్త్ డే సందర్భంగా, అభిమానులకు కానుకగా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్ చూస్తుంటే వావ్ అనిపిస్తుంది. పోస్టర్ లో చిరంజీవి త్రిశూలం పట్టుకొని ఓ భారీ కొండపై కొత్త లోకంలోకి వెళ్తున్నట్టు ఉంది. పోస్టర్ చూస్తేనే సినిమా దానికి తగ్గట్టు ఉండబోతుందని తెలుస్తుంది. ఇక మెగాస్టార్ పుట్టిన రోజున ఇలాంటి పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేయడంతో ఈ పోస్టర్ వైరల్ గా మారింది. ఇక ఈ సినిమా సంక్రాంతి కానుకగా 2025 జనవరి 10 న రిలీజ్ కాబోతుంది.

# రైతులతో రాజకీయాలు వద్దు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు రూ. 40 వేల కోట్ల రుణమాఫీ చేయాలని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యానిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు తొలుత రేవంత్ రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్మృతివనం (ఏకశిలా పార్కు) వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నికలకు ముందు రూ.40వేల కోట్ల రుణమాఫీ అని చెప్పిన కాంగ్రెస్ నేతలు కేబినెట్ సమావేశంలో రూ.31 వేల కోట్లని ప్రకటించారన్నారు. బడ్జెట్ లో మాత్రం రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారని దుయ్యబట్టారు. కానీ మంత్రులు మాత్రం రూ.17వేల కోట్లు మాత్రమే మాఫీ చేశామని ప్రకటించారన్నారు. అయితే ఇప్పటి వరకు రైతులు ఖాతాలో పడ్డది కేవలం రూ.7,500 కోట్లు మాత్రమే అన్నారు. రుణ మాఫీ అయ్యేవరకు బీఆర్ఎస్ పోరు ఆగదన్నారు. అనంతరం అదాలత్ సర్కిల్ లోని ఐఓబీ లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, నర్సింగ్, రంజిత్ రావు, రాధికా రెడ్డి, దివ్యశ్రీ రాజు నాయక్, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, జనార్ధన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు బాబు రావు, సారంగపాణి, జోరిక రమేష్, వేణు, రైతు సమన్వయ సమితి సభ్యులు చుంచు కృష్ణ, నాయకులు నరెడ్ల శ్రీధర్, కుమార్ యాదవ్, అశోక్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు, మహిళలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.




### సవాలక్ష కొర్రీలు..: నన్నపునేని నరేందర్

రైతన్నకు అండగా నిలిచేందుకు రుణమాఫీ పై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు వరంగల్ తూర్పులో తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో హెడ్ పోస్టాఫీస్ సెంటర్ లో భారీ ధర్నా నిర్వహించారు. రుణమాఫీ వల్ల రైతులు బ్యాంకుల చుట్టూ.. అధికారుల చుట్టూ తిరిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వనికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని నరేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మారుపల్ల రవి, సిద్ధం రాజు, టి.రమేష్ బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, డివిజన్ అధ్యక్షులు, రైతు సంఘాల సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### రుణమాఫీ పెద్ద మోసం..: చల్లా ధర్మారెడ్డి

రైతు రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పి రైతులను మోసం చేశారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ అయ్యేదాకా ఆగేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మెడలు వంచి రుణమాఫీ చేయిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు నియోజకవర్గ రైతులపైన నిజంగా ప్రేమ ఉంటే నియోజకవర్గంలో ఇంకా రుణమాఫీ కానీ రైతుల జాబితా సిద్ధం చేసి వెంటనే రుణమాఫీ చేయించాలని సూచించారు.

# డీఈఓను అభినందించిన ట్రస్మా సభ్యులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వర్ ని గురువారం వరంగల్ జిల్లా, డివిజన్ వడుప్సా ట్రస్మా సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి, పుష్పగుచ్చం అంధించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వడుప్సా రాష్ట్ర సలహాదారుడు కొమ్మినేని భూపాల్ రావు, జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున రెడ్డి, జిల్లా కోశాధికారి దండాపంతుల రామ్మూర్తి, ఉపాధ్యక్షులు వంగాల రాధాకృష్ణ, కోడూరి అశోక్ కుమార్, డివిజన్ ముఖ్య సలహాదారులు సామల సుధాకర్, సలహాదారులు యాద విద్యాసాగర్, డివిజన్ అధ్యక్షులు బొల్లం కనకయ్య, కార్యదర్శి జన్ను విలియమ్స్, కోశాధికారి బలవారి సుధీర్, ఉపాధ్యక్షులు సింగారపు రాజు, ప్రొఫెషనల్ కన్వీనర్ రంగు మాధవి, అకాడమిక్ కన్వీనర్ రేపల్లె అశోక్, ఈసీ మెంబర్స్ సామల శశిధర్ రెడ్డి, మురళీ, రాజేందర్ గౌస్ పాషా, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా.. రాజ్ కుమార్-రమ్యశ్రీ రిసెప్షన్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ములుగు రోడ్డు సమీపంలోని ఎస్కే క్రౌన్ కన్వెన్షన్ హాలులో పెంట రాజ్ కుమార్-రమ్యశ్రీ రిసెప్షన్ గురువారం కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకకు బంధుమిత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషులంతా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వరరావు, పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్, సీనియర్ జర్నలిస్టులు పెండ్యాల కొండలరావు, గడ్డం కేశవమూర్తి, తుమ్మ శ్రీధర్ రెడ్డి, వేముల సదానందం, బండారి ప్రమోద్ కుమార్, వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ వేముల నాగరాజు తోపాటు పలువురు హాజరై కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. విందుకు హాజరై నూతన వధూవరులు పెంట రమ్యశ్రీ, రాజకుమారులను ఆశీర్వదించడం పట్ల వరుని తల్లిదండ్రులు పెంట జ్యోతి-కుమార్, బాబాయి వల్లాల వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.



# బీసీల చైతన్యంతో మరో ఉద్యమం

### మండల్ డే పురస్కరించుకొని ప్రత్యేక కథనం

బాబు బిందేశ్వరి ప్రసాద్ మండల్ ఉత్తర బీహార్‌లోని మధేపురాకు చెందిన ధనిక యాదవ్ జమీందార్ కుటుంబం నుంచి వచ్చారు. ఆయన 1968లో బీహార్ ఏడో ముఖ్యమంత్రిగా పని చేశారు. కానీ 30 రోజుల తర్వాత రాజీనామా చేశారు. పార్లమెంటేరియన్‌గా, ఆయన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఇదే మండల్ కమిషన్‌గా ప్రసిద్ధి చెందింది. ఈ కమిషన్ నివేదిక భారతదేశంలోని 'ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు)' అనే వర్గాన్ని చైతన్యపరిచింది. భారతీయ రాజకీయాల్లో పునరావృతం లేకుండా ఉన్న వర్గాలపై విధానాలను గురించి తీవ్రమైన చర్చను ప్రారంభించింది.

### సివిల్ రైట్స్ కమిషన్..

1978 డిసెంబర్‌లో ప్రధాన మంత్రి మురార్జీ దేశాయ్ మండల్ చైర్మన్‌గా ఉన్న ఐదు మంది సభ్యుల సివిల్ రైట్స్ కమిషన్‌ను నియమించారు. మండల్, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు దీర్ఘకాలంగా మద్దతు ఇచ్చారు. దాని ఫలితంగా ఈ కమిషన్, 'మండల్ కమిషన్' లేదా 'వెనుకబడిన తరగతుల కమిషన్' పేరుతో ప్రసిద్ధి చెందింది. 1980లో ఈ కమిషన్ నివేదికను పూర్తి చేసింది. దీనిలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని చోట్ల సముచిత వాటా కల్పించాలని సిఫార్సు చేసింది. ఈ సమాజాల్లోని వెనుకబడిన వర్గాలు చారిత్రకంగా అణచివేయబడడంతోపాటు, ఉద్యోగావకాశాలకు, సరైన విద్యకు చేరువ లేకుండా చేశాయి.

### అడ్డుకున్న ఇందిరా గాంధీ..

ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ, ఈ నివేదికను అమలు చేయకుండా అడ్డుకున్నారు. దశాబ్దం తర్వాత, ప్రధాన మంత్రి వీపీ.సింగ్ మండల్ నివేదిక సిఫార్సులను అమలు చేశారు. తద్వారా భారతదేశంలో కుల రిజర్వేషన్ వ్యవస్థకు దారితీశారు. ఇది 1992 నవంబరులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు అయిన ఇంద్రా సహానె కేసు తర్వాత 1993లో అమలులోకి వచ్చింది. అయితే మండల్ కమిషన్ చాలా మంది ఉన్నత కులాలవారికి ఆనందదాయకంగా లేదు. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. ఉన్నత కులాల విద్యార్థులు తమ విద్యాసంస్థల్లో అవకాశాలు ప్రమాదంలో పడినట్లుగా భావించారు. ఈ కులాలవారు ఇప్పటికీ ఈ విధానాలు అవసరం లేనివిగా మరియు పక్షపాతంగా ఉన్నాయని భావిస్తున్నారు.

### హక్కుల కోసం మరో ఉద్యమం..

ఆగస్టు 25 బీపీ మండల్ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా కూడా మండల కమిషన్ స్ఫూర్తితో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మండల్ కమిషన్ ని అన్ని రాష్ట్రాలు ఆమోదించే విధంగా అన్ని పార్టీలపై ఒత్తిడి తీసుకు రావాల్సిన అవసరం ఏర్పడింది. బీసీల ఐక్యత చాటాలని బీసీలు మరో సారీ తమ హక్కుల పోరాటం కోసం ఉద్యమించేందుకు సిద్ధం కావాల్సి ఉంది. దేశంలో దాదాపు అన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ కేవలం మిగిలింది బీసీల సమస్య ఒక్కటే. కులగణన జరిగితేనే బీసీల జనాభా మరియు ఇతర కులాల జనాభా బయటపడుతుందని దాని తర్వాత కులాల వారిగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా అమలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుంది. అంబేద్కర్ ఆనాడు చెప్పిన విధంగా రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత అందరికీ సమాన హక్కులు, సమాన వాటా దక్కిన తర్వాత సమానత్వంతో కూడిన సమాజం ఏర్పడుతుంది. కాబట్టి బీసీలు అందరూ ఐక్యమై ఆగస్టు 25న బీపీ మండల్ జయంతిని వాడవాడల గల్లీ నుంచి ఢిల్లీ వరకు జరిపి బీసీల చైతన్యం నిరూపించి బీసీల ఐక్యతతో మన హక్కులను సాధించుకోవాలని మరోసారి కోరుకుంటూ ధన్యవాదాలు.



- తాడిశెట్టి క్రాంతి కుమార్
తెలంగాణ ఉద్యమకారుడు , రాజకీయ విశ్లేషకుడు
హనుమకొండ జిల్లా జేఏసీ కన్వీనర్
తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం కన్వీనర్
వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ కంటెస్టెడ్ క్యాండిడేట్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com